అనధికారం.. ప్రమాదకరం

- జాతీయ రహదారిపై డివైడర్లను పగులకొట్టి మార్గాల ఏర్పాటు
- రోడ్డు దాటే సమయంలో తరచూ ప్రమాదాలు
- పోలీస్‌స్టేషన్ వరకూ రాని కేసులే అధికం


ప్రత్తిపాడు జాతీయ రహదారిపై అనధికారిక మార్గంలో డివైడర్‌ను దాటుతున్న వాహన చోదకులు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై అనధికార మార్గాలు ప్రమాదాలను కొనితెస్తున్నాయి. అనేక పర్యాయాలు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. కాస్త దూరం తప్పుతుందనో..సమయం ఆదా అవుతుందనో జాతీయ రహదారిని అడ్డంగా దాటేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో ఏలేశ్వరం మండలం యర్రవరం నుంచి శంఖవరం మండలం మండపం జంక్షన్ వరకు సుమారు 40 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. జంక్షన్లు, డివైడర్ కటింగులు, మలుపులు తదితర వాటిని తెలిపేందుకు వాహనదారులకు హెచ్చరిక బోర్డులు ఉన్నాయి. అయినా అనధికారికంగా ఏర్పాటవుతున్న దారుల వల్ల జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు రోడ్డు దాటేవారిని గుర్తించడం సాధ్యం కావడం లేదు. అంతేకాదు డివైడర్ మధ్యలో పచ్చని మొక్కలు ఉండడం కూడా డివైడర్ మీదనుంచి వచ్చే వారిని గుర్తించలేకపోవడానికి కారణం. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

అనధికార మార్గాలెన్నో...!

ప్రత్తిపాడు జాతీయ రహదారిపై యర్రవరం, ప్రత్తిపాడు పాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన, పెట్రోలు బంకుల వద్ద, చెందుర్తి సమీపంలోనూ.. ఇలా పలుచోట్ల డివైడర్లపై అనధికారికంగా మార్గాలు ఉన్నాయి. డివైడర్‌ను పగుల గొట్టి ఏర్పాటు చేసిన ఈ మార్గాల ద్వారా ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు రోడ్డును దాటేస్తున్నారు.

ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా...!

జాతీయ రహదారిపై అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న మార్గాల్లో ప్రయాణం ప్రాణం మీదుకు తెస్తుంది. డివైడర్‌ను దాటే వారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా..హైవే వాహన చోదకులు వీరిని గమనించకపోయినా... ప్రమాదమే. గతంలో ప్రత్తిపాడులో జాబ్ మేళాకు వచ్చిన యువకుడు స్థానిక పెట్రోల్ బంక్ వద్ద డివైడర్ దాటుతూ హైవేపై వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు. మరో యువకుడు పాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన జరిగిన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నారు. ఎన్‌హెచ్‌పై అనధికారిక మార్గాల్లో డివైడర్‌ను దాటుతున్న నందర్భాల్లో కొందరు గాయాలతో బయటపడగా, మరి కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. అయినా ఈమార్గాల్లో ప్రయాణం ఆగడం లేదు. హైవే అథారిటీ సిబ్బంది తరచూ వీటిని గుర్తించి డివైడర్ గోడలు కట్టినా, మళ్లీ పగలగొట్టి మార్గం ఏర్పాటు చేసుకుంటున్నారు.

ప్రమాదాలు నివారించాలి

ప్రత్తిపాడు జాతీయ రహదారిపై అనధికార మార్గాల్లో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పోలీసులు, హైవే అథారిటి సిబ్బంది సంయుక్తంగా హైవేపై పెట్రోలింగ్ ఏర్పాటు చేసి, అనధికారికంగా ఏర్పాటయ్యే మార్గాల్లో ప్రయాణాలను అడ్డుకోవాలని, ఈ మార్గాల్లో ప్రయాణించే వారికి అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు పోయే ప్రమాదం



జాతీయ రహదారిపై డివైడర్లను హైవే అథారిటీ డిజైన్ చేసింది. దానిని అతిక్రమించరాదు. రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన యూ టర్న్‌లను ఉపయోగించుకోవాలే తప్ప, డివైడర్లను అనధికార మార్గాల్లో దాటడం ప్రమాదకరం. అనధికార మార్గంలో ప్రయాణించడం వల్ల ప్రాణాలు కోల్పేయే ప్రమాదం ఉంది.

– ఎం.శేఖర్‌బాబు, సీఐ, ప్రత్తిపాడు

ప్రమాదాలు అరికట్టాలి



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై అనధికార మార్గాల్లో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలి. పోలీసులు, హైవే అథారిటీ సిబ్బంది సంయుక్తంగా జాతీయ రహదారిపై పెట్రోలింగ్ ఏర్పాటు చేసి, అనధికారికంగా ఏర్పాటయ్యే మార్గాల్లో ప్రయాణాలను అడ్డుకోవాలి. ఈ మార్గాల్లో పయనించే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి.

– తటవర్తి అయ్యన్నదొర, వాహనచోదకుడు, టి.రాయవరం, ప్రత్తిపాడు మండలం

క్లుప్తంగా

90 మందికి ఉచిత కంటి పరీక్షలు


ఏలేశ్వరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సత్యసింధూర

ఏలేశ్వరం: స్థానిక చిరంజీవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చిరంజీవి ఆసుపత్రి వైద్యులు కె.వరప్రసాద్, తనూజనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి డాక్టర్లు కె.సత్యసింధూర, కె.పావని సుమారు 90 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటిచూపు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 20 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం రాజానగరం తరలించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఎడీపీ ప్రసాద్, తూమురౌతు గురయ్య, అలమండ వీరరాఘవస్వామి, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిన్నారుల స్నాతకోత్సవం


శ్రీప్రకాష్‌లో చిన్నారులను సత్కరించిన విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థులు ఆట పాటలతో ఉత్సాహంగా విద్యాభ్యాసం చేయాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ సూచించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆవరణలో సోమవారం యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ చిన్నారులను సత్కరించారు. చిన్నారులపై ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు శ్రద్ధతీసుకోవాలన్నారు. ఆటలు, పాటలు, కథలను నేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిభావం అలవరుచుకోవాలి


ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవరుచుకోవాలని చిద్గగనందా గీతాశ్రమ స్వామిజీ స్వామి మహేష్ ఆనందస్వామి అన్నారు. మండలంలోని సిరిపురం చిద్గగనందా గీతాశ్రమంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందస్వామి మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. భగవంతుడిపై ఆరాధన పెంచుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సాపురం గీతాశ్రమ పీఠాధిపతి స్వామి సూర్యానంద స్వామి, నడిశెట్టి తిరుపతిరావు, అడపా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం


వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, దత్తాత్రేయ శర్మ, ఫణిశర్మ, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


ధరణిని అభినందిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థిని తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించినట్టు యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. యూనివర్సిటీలో మెకానికల్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సీహెచ్ ధరణి ఈ నెల 17, 18 తేదీల్లో విజయనగరంలో జరిగిన జూనియర్ గర్ల్స్ అండర్-55 కేజీల విభాగంలో పాల్గొని రజిత పతకం సాధించినట్టు చెప్పారు. వైస్ చాన్సలర్ ఎస్. రమాశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ సురేష్, తదితరులు ధరణికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న యూనియన్ నాయకులు

గోకవరం: మండలంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపు శాంతిబాబు ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ మాండర్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మృతి చెందిన యూనియన్ ట్రెజరర్ దుర్గబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గంధం బుజ్జి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు అంకిత భావంతో సృజనాత్మకంగా తీసిన ఫొటో కొన్ని పేజీల వార్తా సారాంశమును అర్థవంతంగా తెలియజేసి పాఠకులను ఆలోశింప చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలు, శాంతిబాబు, రాజ్, కొండపల్లి సతీష్, శివ, తేజ, బాబీ, మైపాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓలు 117, 128 రద్దు చేయాలి

ప్రత్తిపాడు: ఉపాధ్యాయులకు అధిక పనిభారం కల్పించిన 117, 128 జీఓలను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడానికి పని సర్దుబాటు విధానం కాకుండా వెంటనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిషు మాధ్యమాలను కొనసాగించేందుకు తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు గోరస దుర్గాప్రసాద్, ఎన్.శ్రీనివాస్, కె.సుబ్రహ్మణ్యం, బి.సత్యప్రసాద్, జి.చంద్రశేఖర్, డీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు నిరసనగా ఆందోళన


ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు


శంఖవరం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు నిరసనగా సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ఆందోళన చేశారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి కేంద్ర ప్రభుత్వం, ఏలేశ్వరం మండలంలోని మర్రివీడులో మొండెంతో మహిళ మృతదేహం లభ్యం ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగులాపల్లి అర్జునుడు, సోమాల కుశల, సాబే కొమ్మయ్య, చిన్నయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిరసనకు అంగన్‌వాడీల సంఘీభావం

శంఖవరం: పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన సంఘటనను నిరసనగా స్థానిక వైద్యులు చేస్తున్న నిరసనకు అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. పీహెచ్‌సీ ఆవరణలో నిరసన శిబిరానికి సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు వెళ్లి సంఘీభావం తెలిపారు. దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్‌వీవీ సత్యనారాయణ, శెట్టిబత్తుల రాజీవ్, సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు అరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

జగ్గంపేట: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని గోవిందపురంలో లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. దోషులను శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ లిబరేషన్ జిల్లా కమిటీ మెంబర్ జక్కంపూడి రాజు, ఐఎఫ్‌యూ నాయకులు రబ్బల సంకురమ్మ, కోరుకొండ మరిడమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసన

గోకవరం: బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సమితి అధ్యక్షుడు తోట సాయిబాబా, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా ఆధ్వర్యంలో గోకవరంలో ప్రధాన రహదారిపై శాంతియుతంగా నిరసన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కొరిపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

జగ్గంపేట/కిర్లంపూడి: నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సోమవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గంలోని జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయని తెలిపారు. జగ్గంపేటలోని పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అనువుగా వున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో కాకినాడ పబ్లిక్ అండ్ హెల్త్ ఏఈ బ్రహ్మతేజ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌కు సత్కారం


మల్లేపల్లిలో లైన్‌మన్ శ్రీనివాసరాజును సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పక్కలపాటి శ్రీనివాసరాజును సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శ్రీనివాసరాజుకు ఉత్తమ సేవా పురస్కారం లభించడంతో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, కార్యదర్శి కట్టా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు రామకుర్తి నాగేశ్వరరావు, గొల్లపల్లి లోవరామకృష్ణ, దార్లంక నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చేపూరు సర్పంచ్‌కు చెక్ పవర్ పునరుద్ధరణ

తుని రూరల్: మండలంలోని చేపూరు గ్రామ సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావుకు చెక్కు డ్రాయింగ్ (చెక్ పవర్) అధికారాన్ని పునరుద్ధరిస్తూ కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ సాధారణ నిధులు రూ.17,12397 దుర్వినియోగంపై గతేడాది జూలై 23న సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసి సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. సంజాయిషీ నోటీసులకు సమాధానం ఇవ్వడం, నిధులు దుర్వినియోగం కాలేదని రుజువు కావడంతో తిరిగి చెక్ పవర్ పునరుద్ధరించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 15వ సంఘం నిధులు వినియోగంపై అధికారాన్ని పునరుద్ధరించినట్టు తుని ట్రెజరీ అధికారికి లేఖ ద్వారా తెలియజేసినట్టు ఆమె వివరించారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో సోమవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని వైద్యారోగ్యశాఖ సబ్‌సెంటర్‌లో ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ సంక్రమణ, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధి సంక్రమించకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్.రామకృష్ణ, లింక్ వర్కర్ సూర్యామణి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రమదానంతో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు


రావికంపాడులో శ్రమదానంతో స్పీడ్ బ్రేకర్ వేస్తున్న గ్రామస్తులు

తొండంగి: నిత్యం భారీ వాహనాలు అత్యంత వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో గ్రామస్తులే శ్రమదానం వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌బ్రేకర్లు వేసుకున్నారు. మండలంలోని పెరుమాళ్లపురం తీరప్రాంతంలో పారిశ్రామిక అవసరాలు, పరిశ్రమల స్థాపన వంటి కార్యకలాపాల కోసం వందల సంఖ్యలో వాహనాలు రావికంపాడులో ప్రధాన రహదారి మీదుగా కత్తిపూడి-ఏవీ నగరం రహదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ వాహనాల వేగంతో ప్రయాణించడంతో ఓలారీ ఢీకొని గ్రామానికి చెందిన నొక్కే ధర్మమ్మ తీవ్రగాయాల పాలైంది. రెండు కాళ్లు విరిగిపోవడంతో మంచానికి పరిమితమైంది. ఇదేవిధంగా మరో యువకుడిని లారీ ఢీకొట్టడంతో బైకుపై నుంచి లారి కిందపడి స్వల్పగాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. తంలో కూడా ఈ రహదారిలో సీతారాంపురానికి చెందిన ఒకరు మృత్యువాతపడిన సంఘటన చోటు జరిగింది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ప్రమాదాల కారణంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం జరిగాయి. తరచూ లారీలతో పాటు ఇతర వాహనాల వేగాన్ని నియంత్రించాలని గ్రామస్తులు ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో గ్రామంలోని స్థానిక యువత, పెద్దలు శ్రమదానంతో అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసుకున్నారు. గోపాలపట్నం-తొండంగి-ఒంటిమామిడి రహదారిలోనూ, కత్తిపూడి నుంచి రావికంపాడు, ఏవీ నగరం మీదుగా పెరుమాళ్లపురం మీదుగా వెళ్లే రహదారిలో అనేక చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ రెండు రహదారుల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్కూల్ జోన్ల వద్ద, ప్రధానంగా జనసంచారం ఉన్న సెంటర్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు


ఏలేశ్వరంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


వీరవరంలో తోట నరసింహానికి రాఖీ కడుతున్న విద్యార్థిని


ప్రత్తిపాడులో ఎంపీడీఓ కుమార్‌బాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి తులసి

ఏలేశ్వరం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలు సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అన్నలకు చెల్లెలు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. అన్నదమ్ములకు అక్కాచెల్లెలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీలు కట్టిన చెల్లెళ్లకు అన్నలు బహుమతులు అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. యర్రవరంలోని సరస్వతీ శిశుమందిర్‌లో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కురాకుల రాజాకు విద్యార్థులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి తోట వీర మహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలవ్యాప్తంగా సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకూ మహిళలు అన్నదమ్ములకు చేతికి రాఖీలు కట్టి, సోదరుల నుంచి కానుకలను అందుకున్నారు. స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బ్రహ్మకుమారి తులసీ ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఏపీఎం కుమారస్వామి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, మినర్వా విద్యా సంస్థల అధినేత డీవీఎస్ రమేష్‌రాజు, పలువురు అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. బ్రహ్మకుమారీలు తులసి, శ్రీదేవి, సౌజన్య, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. మండంలంలోని వీరవరంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహానికి పలువురు విద్యార్థినులు, అక్కచెల్లమ్మలు రాఖీలు కట్టి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

వృక్షాలను సంరక్షించాలి

గండేపల్లి: ప్రతిఒక్కరూ ఓ చెట్టును దత్తత తీసుకుని దానికి సంరక్షించాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా సోమవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ హరిత ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వృక్షాబంధన్ నిర్వహించారు. చెట్లకు రాఖీలు కట్టి చెట్లను రక్షించండి ప్రకృతిని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కె.జ్ఞానేశ్వరి, ఎస్.తిరుమల దేవి, బిఎస్‌బి వైదేహి, ఎన్.దివ్య తదితరులు పాల్గొన్నారు.

తాండవ ఆయకట్టుకు నీరు విడుదల


గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఆయకట్టు రైతులు

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు సోమవారం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద పండితులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయకట్టు రైతులు, ప్రాజెక్టు అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఈ పి.అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం జలాశయంలో 376.7 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఎడమ ప్రధాన కాలువకు రెండు వందల క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, నదికి 30 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. కాలువల పరిస్థితిని పరిశీలించిన తరువాత నీటి విడుదల శాతాన్ని పెంచుతామని వివరించారు. కార్యక్రమంలో జేఈఈలు శ్యాంకుమార్, వినయ్‌కుమార్, రవికుమార్, రామకృష్ణ, రమణపాత్రుడు, వర్క్ ఇనస్పెక్టర్ నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక పుత్ర చెరువు జంక్షన్ వద్ద వేంచేసిన సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ పండితుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కనపర్తి సత్యనారాయణ పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలూరు, చిన్నింపేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అన్న ప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

ప్రత్తిపాడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం నుంచి అక్టోబర్ 18 వరకు ఓటు నమోదుపై ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్టు సహాయ ఓటరు నమోదు అధికారి, ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం. సూర్యప్రభ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) బీఎల్వో యాప్ నందు ఓటరు జాబితా వెరిఫికేషన్ చేయాలన్నారు. బీఎల్వోలు ఇంటింటా సర్వే చేసి ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, డీటీ కె.పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన అశోక్ గజపతిరాజు

అన్నవరం: విశాఖ జిల్లా సింహాచలం దేవస్థానం చైర్మన్, మాజీ కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతి రాజు సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. పశ్చిమ రాజగోపురం వద్ద ఆయనకు ఈఓ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా ఈఓ స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

తొండంగి: మండలంలోని పాడి పశువులకు మంగళవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.చైతన్య తెలిపారు. నాలుగు నెలలు వయస్సు దాటిన పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు వ్యాక్సిన్లు వేస్తారన్నారు. పాడి రైతులు తమ పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: గ్రామ శివారు గుర్రంపాలెం రోడ్డులో సారా బట్టీలపై సోమవారం జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 2100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడుతున్న జగ్గంపేట శెట్టిబలిజపేటకు చెందిన మునసా జియ్యన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.